సాక్షి చిత్తూరు
శనివారం । 21 । జనవరి । 2023



చిత్తూరు బులియన్

బంగారం :	
24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.54,000
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,200
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.70,000
రిటైల్ వెండి గ్రాము	రూ.73

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	31	17
తిరుపతి	31	17
తిరుమల	26	13
గూడూరు	31	19
నగరి	32	18



రథసప్తమికి ఏర్పాట్లు

తిరుమల: శ్రీవారి ఆలయంలో ఈనెల 28న రథ సప్తమి వేడుకలు నిర్వహించనున్నారు. ఒక్కరోజు పండగ కోసం ఏర్పాట్లు ముమ్మరంగా చేశారు. మాడ వీధుల్లో రంగుల ముగ్గులు వేస్తున్నారు.

న్యూస్‌రీల్

ఆ శిలా శాసనం 1674 నాటిది..



పుంగనూరు మండలం నెక్కుంది ఆలయంలోని పురాతన శాసనం

పుంగనూరు: మండలంలోని నెక్కుంది గ్రామ అగస్త్యేశ్వరస్వామి ఆలయం వద్ద ఉన్న పురాతన శిలా శాసనం 1674 కాలం నాటిదని చరిత్ర అధ్యాపకులు కందులసావిత్రి, ఆంజనేయరెడ్డి తెలిపారు. శుక్రవారం ఆలయంలో ఆంజనేయ రెడ్డి మాట్లాడుతూ చోళులకాలంలో నిర్మించిన పురాతన శాసనాన్ని ఆలయంలో గుర్తించామన్నారు. ఈ శాసనాన్ని మైసూర్‌లోని పురావస్తుశాఖ డైరెక్టర్ మునిరత్నంరెడ్డికి పంపి వివరాలు సేకరించామన్నారు. 1674 సంవత్సరానికి చెందిన ఈ శాసనంలో తెలుగు అక్షరాలను పోలి బైరుకూరుకు చెందిన అమ్మజమ్మ మనువడు, వారి కుటుంబ సభ్యులు శివాలయం మండపం కట్టించినట్లు లిఖించి ఉన్నారని తెలిపారు. అలాగే ఆలయంలో మరోక శాసనం ఉందని, దానిపై కూడ పరిశోధన చేస్తున్నట్లు పేర్కొన్నారు. పురాతన ఆలయాలకు సంబంధించి శాసనాలను పరిశీలించి వాటి చరిత్రను తెలియజేస్తున్నామని తెలిపారు.

చిత్తూరుకు ప్రీమియం రిజిస్ట్రేషన్ సెంటర్

చిత్తూరు కార్పొరేషన్: జిల్లాకు ప్రీమియం రిజిస్ట్రేషన్ సెంటర్‌ను(పీఆర్‌సీ) మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఇప్పటికే తిరుపతికి ప్రభుత్వం ప్రీమియం రిజిస్ట్రేషన్ సెంటర్‌ను మంజూరు చేసింది. పాస్‌పోర్టు సేవా కేంద్రాల తరహాలో ముందుగా స్లాట్ బుకింగ్, డ్యాకుమెంట్ ప్రిపరేషన్ అయ్యాక, అదే రోజు రిజిస్ట్రేషన్ డ్యాకుమెంటు ఇవ్వడం, వేగంగా సేవలు అందించాలనే సంకల్పంతో ఈ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నారని అధికారులు పేర్కొన్నారు. జిల్లాలో ఎక్కడి నుంచి అయినా రిజిస్ట్రేషన్ చేసుకోనే అవకాశం ఉంటుందన్నారు. ఇది వరకే పైలట్ ప్రాజెక్టుగా శ్రీకాకుళం, విశాఖపట్నంలో పీఆర్‌సీలను ఏర్పాటు చేశారు.

వెబ్‌సైట్‌లో ఎన్‌ఎంఎంఎస్ హాల్ టికెట్లు

చిత్తూరు కలెక్టరేట్ : ఎన్‌ఎంఎంఎస్ హాల్‌టికెట్లు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని డీఈఓ విజయేంద్రరావు తెలిపారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ 2022-23 విద్యా సంవత్సరం ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష ఫిబ్రవరి 5 వ తేదీన నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. ఈ పరీక్షకు హాజరవుతున్న విద్యార్థుల హాల్‌టికెట్లు డబ్ల్యూడబ్ల్యూ డబ్ల్యూ.బీఎస్‌ఈ. ఏపీ.జీవోవి.ఇన్ వెబ్‌సైట్‌లో డౌన్‌లోడ్ చేసుకునేలా వెసులుబాటు కల్పించారని తెలిపారు. ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు యూడైస్ కోడ్ లాగిన్‌తో హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసి విద్యార్థులకు అందజేయాలని డీఈవో ఆదేశించారు.

ఫారెస్ట్ సెటిల్‌మెంట్ అధికారిగా చంద్రశేఖర్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా ఫారెస్ట్ సెటిల్‌మెంట్ అధికారిగా చంద్రశేఖర్ నాయుడు నియమితులయ్యారు. శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా డిప్యూటీ కలెక్టర్లకు స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లుగా ప్రభుత్వం ఉద్యోగోన్నతి కల్పించింది. ఉద్యోగోన్నతి పొందిన వారికి పోస్టింగ్‌లు ఇస్తూ ఉత్తర్వులు జారీచేసింది. ఆ ఉత్తర్వుల మేరకు చిత్తూరు జిల్లా ఫారెస్ట్ సెటిల్‌మెంట్ అధికారిగా చంద్రశేఖర్ నియమితులయ్యారు.

ఓటరు జాబితాలో తప్పుల్లేకుండా చర్యలు



ఓటర్ల జాబితా కసరత్తును పర్యవేక్షిస్తున్న డీఆర్‌ఓ రాజశేఖర్

చిత్తూరు కలెక్టరేట్ : ఓటరు జాబితా తయారీలో ఎటువంటి తప్పులు లేకుండా చర్యలు చేపట్టాలని డీఆర్‌ఓ రాజశేఖర్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్న ఓటరు జాబితా కసరత్తును ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. డీఆర్‌వో మాట్లాడుతూ ఎంఎల్‌సీ ఎన్నికల కసరత్తును పకడ్బందీగా పరిశీలిస్తున్నట్లు తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు పారదర్శకంగా ఓటరు జాబితాను సిద్ధం చేసేలా చర్యలు చేపడుతున్నామన్నారు. తప్పులు దొర్లకుండా పర్యవేక్షిస్తున్నట్లు డీఆర్‌ఓ వెల్లడించారు.

దారుకు జీవం.. కళకు ప్రాణం



దేవుడే దిగివచ్చాడా..తనకు తానే ఈ బొమ్మల్లో ఒదిగిపోయి ఊపిరి పోసుకున్నాడా అనిపిస్తుంది ఈ దారు శిల్పాల హస్తకళా చాతుర్యాన్ని తిలకిస్తే. దేనికదే దివ్యకళా దృష్టితో దర్శనమిస్తుంది. నాట్యగణపతి, శ్రీవేంకటేశ్వరస్వామి, దశావతారాలు, అష్టలక్ష్ములు, సకల దేవతాస్వరూపాలు.. గృహోపకరణాల కళాకృతులు ఒకదానికి మరొకటి జీవం పోసుకుంటూ సృష్టికి ప్రతిసృష్టి చేస్తోంది తొరూరు.



బొమ్మలు చెక్కుతున్న కళాకారులు

- దారు కళల కాణాచి తొరూరు
- కొయ్యకు ప్రాణం పోసే కళాకారులు
- అద్భుత కళాఖండాల సృష్టికి గని

పుత్తూరు రూరల్: దారు(చెక్క) శిల్పాల కళాఖండాల కాణాచిగా తొరూరు గ్రామం గుర్తింపు పొందింది. ఇది పుత్తూరు పట్టణానికి నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉంది. గ్రామంలోని వారంతా వ్యవసాయం, కూలి పనుల మీద ఆధారపడి జీవిస్తున్నారు. సుమారు 40 కుటుంబాలు దారుబొమ్మల తయారీపైనే ఆధారపడి జీవిస్తున్నారు. ప్రసిద్ధి చెందిన ఆలయాల నుంచి గ్రామ స్థాయి ఆలయాల్లోని దేవతామూర్తుల కళాకృతులు ఈ కళాకారుల చేతుల్లో ఒదిగి పోతాయి. ఆరు దశాబ్దాల క్రితం ఇదే గ్రామానికి చెందిన ఎం రామలింగం దారు బొమ్మలు చెక్కడంపై చూపించిన చొరవ గ్రామానికే కీర్తిని తెచ్చి పెట్టింది. తాను నేర్చుకున్న కళ తనతోనే అంతరించి పోకుండా మరి కొందరికి బొమ్మలు చెక్కడంపై ఆయన శిక్షణ ఇచ్చాడు. దీంతో పలు కుటుంబాలకు బొమ్మల తయారీ జీవనాధారమైంది. తొలుత చిన్న చిన్న బొమ్మలను మాత్రమే తయారు చేసేవారు. వీటిని అమ్ముకోవడం పెద్ద సమస్యగా ఉండేది. దీంతో రామలింగం మద్రాసుకు వెళ్లి వాటిని అమ్ముకొని వచ్చేవారు. క్రమేపీ కళాకృతులను హైదరాబాద్, బెంగుళూరు, విజయవాడ, ఢిల్లీ, ముంబయి వంటి పట్టణాలకు తీసుకెళ్లి అమ్మకాలు చేస్తుండడంతో వ్యాపారాలు ఆశాజనకంగా ఉన్నట్లు కళాకారులు చెబుతున్నారు.

ఒకదానికి మించి మరొకటి..

ప్రస్తుతం ఆరడుగుల నిలువెత్తు శ్రీవేంకటేశ్వరస్వామి, శ్రీకృష్ణ సత్యభామ, గణపతి వంటి బొమ్మలతో పాటు గృహోపకరణాలకు సంబంధించి ఏనుగు తల, గుర్రం, దశావతారం, తోరణాలు వంటి కళాకృతులు అందంగా తయారు చేస్తున్నారు. ప్రస్తుతం వీటిని ప్రతి నెలా నగరాల్లో నిర్వహించే ఎగ్జిబిషన్లలో పెట్టి అమ్మకాలు జరుపుతున్నారు. వీరికి చేయూతనిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఎగ్జిబిషన్స్‌లో పెట్టే స్టాల్స్‌ను ఉచితంగా ఇవ్వడంతో పాటు ఉచిత వసతి సౌకర్యం కల్పిస్తోంది.





శ్రీవేంకటేశ్వరస్వామి

గ్రామం :	తొరూరు
మండలం :	పుత్తూరు
జిల్లా :	తిరుపతి
కళా కారులు :	40 కుటుంబాల వారు దారు కళాఖండాల తయారీలో దేశవ్యాప్త గుర్తింపు



శ్రీకృష్ణ



చేయూతనిస్తే అద్భుతాలు సృష్టిస్తాం



మా తండ్రి రామలింగం అందించిన బొమ్మల తయారీని వృత్తిగా కొనసాగిస్తున్నా. ప్రస్తుతం 20 మందికి పనికల్పిస్తున్నా. ప్రభుత్వం తక్కువ వడ్డీతో ఆర్థిక సాయం చేస్తే మేలైన కళాఖండాలను అందిస్తాం. ప్రస్తుతం కొయ్యల ధరలు ఎక్కువగా ఉన్నాయి. ఢిల్లీ, ముంబయి, బెంగళూరు, చెన్నై వంటి నగరాల్లోని ఎగ్జిబిషన్స్‌లో అమ్మకాలు జరపాలంటే పెద్ద మొత్తంలో పెట్టుబడులు అవసరం. ఇందుకు ప్రభుత్వ పరంగా చేయూతనిస్తే అద్భుతాలు సృష్టిస్తాం. మా ప్రతిభకు తగిన గుర్తింపు వస్తే అంతకుమించి ఏమీ అవసరం లేదు.

ఎం.వెంకటేష్, దారుశిల్పి, తొరూరు, పుత్తూరు మండలం

15 ఏళ్లుగా ఇదే వృత్తి



పదిహేనేళ్లుగా బొమ్మల తయారీ పనిచేస్తున్నా. గ్రామంలో సుమారు 40 కుటుంబాలు ఈ బొమ్మల తయారీపైనే ఆధారపడి జీవిస్తున్నాయి. బొమ్మల తయారీలో ఓపిక, సహనం అవసరం. ఏమాత్రం పొరబాటు జరిగినా మొత్తం చెక్కను పడేయాల్సిందే. మా కూలి ప్రస్తుత ధరకు సరిపోవడం లేదు. ప్రభుత్వం మాలాంటి కళాకారులకు పెన్షన్ ఇచ్చి ఆదుకోవాలి. పెట్టుబడికి ప్రభుత్వం సాయం చేస్తే ఎంతో మంది ఇలాంటి చేతి వృత్తుల పట్ల ఆసక్తి చూపుతారు.

– మాధవయ్య, చెక్క శిల్పాల కళాకారుడు, తొరూరు

కార్యకర్తలకు అండగా ఉంటాం

- టీడీపీ శ్రేణులు ధోరణి మార్చుకోవాలి
- తీరుమారకుంటే తగిన బుద్ధి చెబుతాం
- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



పనులను పరిశీలిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

రొంపిచెర్ల : కార్యకర్తలకు అండగా ఉంటామని, ఎవరూ అధైర్య పడాల్సిన అవసరం లేదని అటవీ, భూగర్భ గనులు, విద్యుత్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి భరోసా ఇచ్చారు. శుక్రవారం రొంపిచర్ల పర్యటనలో ఉన్న మంత్రిని పలువురు వైఎస్సార్ సీపీ కార్యకర్తలు కలిశారు. మండలంలో తెలుగుదేశం పార్టీ నాయకుల దౌర్జన్యాలు ఎక్కువవుతున్నాయని తెలిపారు. రొంపిచెర్లలో రెండు వారాల కిందట వైఎస్సార్ సీపీ బ్యానర్లు చించివేసి తమపైనే దాడి చేశారని చెప్పారు. తాజాగా శ్రీరాముల గుడి ఉత్సవాల్లో వైఎస్సార్ సీపీ కార్యకర్తలు పాల్గొనకూడదని దాడులు చేస్తున్నారని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై మంత్రి స్పందిస్తూ కార్యకర్తలకు అండగా ఉంటామని, ఎవరు టీడీపీ దాడులకు భయపడాల్సిన అవసరం లేదన్నారు. టీడీపీ కార్యకర్తలు దాడులు చేసేందుకే రెచ్చ గొడుతున్నారని, కార్యకర్తలు జాగ్రత్తగా ఉండాలని, సంయమనం పాటించాలని సూచించారు. టీడీపీ శ్రేణులు ధోరణి మార్చుకోకపోతే తగినరీతిలో సమాధానం చెప్పాల్సి ఉంటుందని మంత్రి పెద్దిరెడ్డి హెచ్చరించారు.

వైఎస్సార్‌సీపీకి తీరని లోటు

వైఎస్సార్‌సీపీ నాయకులు కృష్ణారెడ్డి, రెడ్డిచిన్నప్ప నాయుడు మృతి పార్టీకి తీరని లోటని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. మండలంలోని ముప్పిరెడ్డిగారిపల్లెకు చెందిన కృష్ణారెడ్డి, గడ్డాలవారిపల్లెకి చెందిన రెడ్డిచిన్నప్పనాయుడు గురువారం రాత్రి మృతి చెందారు. సమాచారం అందుకున్న మంత్రి శుక్రవారం ఆయా గ్రామాలకు వెళ్లి మృతదేహాలను సందర్శించి, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. తాను అండగా ఉంటానని ధైర్యం చెప్పారు. మృతుల కుటుంబాలను పరామర్శించిన వారిలో ఇంకా ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు రెడ్డీశ్వర్ రెడ్డి, సర్పంచ్‌లు ఇబ్రహీంఖాన్, నాగిరెడ్డి, అన్సర్‌బాషా, నాయకులు చెంచురెడ్డి, సలీంబాషా, సూర్యనారాయణ రెడ్డి, చిన్న నాగరాజ, లక్ష్మయ్య, అమరనాథరెడ్డి, ప్రకాష్ రెడ్డి, కరీముల్లా తదితరులు ఉన్నారు.

రిజర్వాయర్ పనుల పరిశీలన

సోమల: మండలంలోని ఆవులపల్లె వద్ద దాదాపు రూ.750 కోట్లతో నిర్మిస్తున్న సీతమ్మ చెరువు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ పనులను మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి శుక్రవారం పరిశీలించారు. భూములు కోల్పోయిన రైతులకు, గ్రామస్తులకు ప్రభుత్వ పరంగా ఆదుకుని నష్టపరిహారాన్ని అందిస్తామని తెలిపారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, మండల అధ్యక్షుడు గంగాధరం, మైనారిటీ అధ్యక్షుడు మస్తాన్ వలీ, సర్పంచ్ కొదండరాజు, నేతలు నాగభూషణంరెడ్డి, వెంకటరెడ్డి, ఝాన్సీలక్ష్మి, వీవీ రమణ పాల్గొన్నారు.

ఉద్యోగుల సంక్షేమమే ధ్యేయం



ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

పెనుమూరు(కార్వేటినగరం) : తమ ప్రభుత్వం ఉద్యోగుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందని, నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కూడా కల్పిస్తున్నట్లు ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణ స్వామి తెలిపారు. శుక్రవారం పెను మూరు మండలం చింతపెంట పంచాయతీ పరిధిలో ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. 'బాబు వస్తే జాబు గ్యారెంటీ' అని అధికారంలోకి వచ్చి నిరుద్యోగులను చంద్రబాబు గతంలో నయవంచన చేసిన విషయం ప్రజలందరికీ తెలిసిందేనని పేర్కొన్నారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడూ ఉద్యోగ అవకాశాలు రాక ఉన్నత చదువులు చదివిన నిరుద్యోగులు ఆత్మహత్య చేసుకున్న సంఘటనలు చాలా ఉన్నాయని విమర్శించారు. అందుకే గత ఎన్నికల్లో టీడీపీకి యువత తగిన బుద్ధి చెప్పిందని తెలిపారు. వైఎస్ జగన్‌మోహన్ అధికారంలోకి వచ్చిన మూడున్నర సంవత్సరాల కాలంలోనే దాదాపు రెండున్నర లక్షల మందికి శాశ్వత ప్రాతిపదికన ఉద్యోగాలు కల్పించినట్లు పేర్కొన్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలను పట్టించుకోలేదని, ఉద్యోగులకు చెల్లించాల్సిన టీఏ, డీఏలను పెండింగ్‌లో పెట్టిందన్నారు.

క్రికెట్ ఆడుదాం.. ప్రతిభ చాటుదాం

ఈ నెల 22 సాక్షి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీ ఎంట్రీలకు చివరి తేదీ

SAKSHI DIGITAL MEDIA GROUP — SPL SAKSHI PREMIER LEAGUE

బ్యాట్ పట్టుకొని బంతిని బౌండరీ దాటించాలని ఉందా? బుల్లెట్ వేగంతో బంతులు వేస్తూ వికెట్లను గిరాటేయాలని ఉందా? మెరుపు వేగంతో కదులుతూ బ్యాటర్లను రనౌట్ చేయాలని ఉందా? క్రికెట్ ఆడేద్దామని.. మనలోని ప్రతిభను ప్రపంచానికి చాటి చెప్పాలని మనసులో బలమైన కోరిక ఉంటే సరిపోదు.. దానికి వేదిక కూడా కావాలిగా! ఇలాంటి ఔత్సాహిక క్రికెటర్లు తమ కలలు నెరవేర్చుకునేందుకు మళ్లీ సమయం వచ్చేసింది. మరో ఆలోచన లేకుండా ముందుగా మీ జట్టును తయారు చేసుకొని ఎంట్రీలు పంపించండి.. ఆ తర్వాత సమరానికి సై అనండి.

ఔత్సాహిక క్రికెటర్లకు సువర్ణావకాశాలు కల్పించాలనే సదుద్దేశంతో సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో ఈ నెల(జనవరి) నాలుగో వారంలో సాక్షి ప్రీమియర్ లీగ్ (ఎస్‌పీఎల్) క్రికెట్ టోర్నీ నాలుగో సీజన్ మొదలుకానుంది.

టోర్నీ ఫార్మాట్..

ముందుగా జిల్లా, ప్రాంతీయ, రాష్ట్ర స్థాయిలో నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు జరుగుతాయి. ఈ మ్యాచ్‌లను 10 ఓవర్లపాటు నిర్వహిస్తారు. జిల్లా స్థాయిలో విజేతగా నిలిచిన జట్లు ప్రాంతీయ స్థాయి టోర్నీకి అర్హత సాధిస్తాయి. ఈ మ్యాచ్‌లను 20 ఓవర్లపాటు నిర్వహిస్తారు. ప్రాంతీయ స్థాయి టోర్నీ విజేతలు రాష్ట్ర స్థాయిలో రౌండ్ రాబిన్ లీగ్ పద్ధతిలో టైటిల్ కోసం తలపడతాయి. ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికగా ఎంట్రీలు స్వీకరిస్తారు.

ఎంట్రీ ఫీజు..

ఈ టోర్నీలో పాల్గొనాలనుకునే జట్లు రూ.1,500 ఎంట్రీ ఫీజుగా చెల్లించాల్సి ఉంటుంది. ఈ మొత్తాన్ని ఆన్‌లైన్‌లోనూ, ఆఫ్‌లైన్ పద్ధతిలోనూ చెల్లించవచ్చు. వివరాలకు సాక్షి జిల్లా యూనిట్ కార్యాలయంలో సంప్రదించాలి. https://www.arenaone.in/registration వెబ్‌సైట్‌లోనూ వివరాలు లభిస్తాయి. ఎంట్రీలను ఈ నెల 22తేదీలోపు పంపించాలి.

ఏ ఏ విభాగాల్లో...

ఈ లీగ్‌ను రెండు కేటగిరీల్లో నిర్వహిస్తారు. అండర్-19 జూనియర్ స్థాయిలో (1 జనవరి 2003 తర్వాత జన్మించి ఉండాలి). అండర్-25 సీనియర్ స్థాయిలో (1 జనవరి 1997 తర్వాత జన్మించి ఉండాలి) వేర్వేరుగా నిర్వహిస్తారు.

జూనియర్ స్థాయిలో ఆడేందుకు జూనియర్ కాలేజీ జట్లకు, సీబీఎస్‌ఈ స్కూల్ (ప్లస్ 1, 2) జట్లకు, ఐటీఐ, పాలిటెక్నిక్ జట్లకు అర్హత ఉంది. సీనియర్ స్థాయిలో ఆడేందుకు డిగ్రీ, పీజీ, మెడిసిన్, ఇంజినీరింగ్, ఫార్మా కాలేజీ జట్లకు అవకాశం కల్పిస్తారు.

ఎన్ని జట్లకు అవకాశం..

ఒక్కో కాలేజీ నుంచి గరిష్టంగా రెండు జట్లను పంపించే వెసులుబాటు ఉంది. రెండు జట్లు కూడా వేర్వేరుగా ఎంట్రీ ఫీజు చెల్లించాలి. ఒక జట్టులో ఆడే ఆటగాడు మరో జట్టుకు ఆడకూడదు. మ్యాచ్‌లు ఆడే సమయంలో ఆటగాళ్ల వయసు ధ్రువీకరణ పత్రాలను చూపించాల్సి ఉంటుంది. మ్యాచ్ సమయంలో ఇరుజట్ల ఆటగాళ్లు తమ కళాశాల గుర్తింపు కార్డు (ఒరిజినల్) చూపించాలి. మ్యాచ్ జరిగే సమయంలో బ్యాటర్స్, వికెట్ కీపర్ తప్పనిసరిగా హెల్మెట్లు, లెగ్ ప్యాడ్‌లు, అండర్ గార్డ్స్, హ్యాండ్ గ్లౌవ్స్, వైట్ డ్రెస్, వైట్ షూస్ ధరించాలి.

ఇతర వివరాలకు నిర్వాహకులను సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు

85559 74855

గమనిక: అన్ని విషయాల్లో నిర్వాహకులదే తుది నిర్ణయం.

మత సామరస్యానికి ప్రతీక గంధ మహోత్సవం



గంధ మహోత్సవంలో పాల్గొన్న మంత్రి ఆర్కే రోజా

పుత్తూరు రూరల్: ముస్లింలు ఎంతో పవిత్రంగా నిర్వహించే గంధ మహోత్సవం మత సామరస్యానికి ప్రతీక అని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి ఆర్కే రోజా పేర్కొన్నారు. శుక్రవారం రాత్రి స్థానిక గేట్‌పుత్తూరులోని నాగూర్ ఖాదర్‌వల్లీ దర్గాలో జరిగిన గంధ మహోత్సవంలో ఆమె పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ గంధ మహోత్సవాల్లో ముస్లింలతోపాటు హిందువులూ పాల్గొనడం, వినాయక చవితి వేడుకల్లో ముస్లింలు పాల్గొనడం మత సామరస్యానికి దర్పణం పడుతుందన్నారు. ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ వీఎం మాహీన్, మున్సిపల్ వైస్ చైర్మన్ జయప్రకాష్, కమిషనర్ కేఎల్‌ఎన్‌రెడ్డి, నాయకులు సుదర్శనం పాల్గొన్నారు.

మెగాకు భయపడే విమర్శలు

నగరి: చిన్న తారలందరూ భయంతోనే మెగా ఫ్యామిలీతో ఉన్నారని పర్యాటకశాఖ మంత్రి ఆర్కేరోజా అన్నారు. చిన్నతారలు మంత్రులపై కామెంట్లు చేయడంపై ఆమె శుక్రవారం మీడియాతో మాట్లాడారు. భయంతోనే పలువురు తారలు మెగా ఫ్యామిలీతో ఉన్నారు తప్ప ప్రేమతో కాదన్నారు. మెగా ఫ్యామిలీలో ఆరేడుగురు హీరోలు ఉన్నారని, వారి మాట వినకుంటే తమకు సినిమాల్లో అవకాశాలు రావని ప్రేమ నటిస్తూ వారివెంట ఉన్నారన్నారు. యాక్టర్లు నిజమైన ప్రేమతో వెంట ఉంటే వారు సపోర్టు చేసిన ప్రకాష్‌రాజ్ మా ఎన్నికల్లో ఎందుకు గెలవలేకపోయారని ప్రశ్నించారు. వ్యతిరేకంగా మాట్లాడితే ఇండస్ట్రీలో లేకుండా చేస్తారేమోననే భయంతో చిన్నయాక్టర్లు వారు చెప్పినట్లు మాట్లాడుతున్నారన్నారు. భయంతో మాట్లాడినా మంత్రులనుద్దేశించి మాట్లాడే సమయంలో విజ్ఞత, వివేకం అవసరమని సూచించారు.

సేంద్రియ సాగుకు సర్కారు సహకారం

- మాండూస్‌తో దెబ్బతిన్న పంటలకు త్వరలో సాయం
- ఈ క్రాప్ బుకింగ్, ఈ కేవైసీలో మొదటి స్థానం
- జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశంలో చైర్మన్ రామచంద్రారెడ్డి



మాట్లాడుతున్న సలహా మండలి జిల్లా చైర్మన్ రామచంద్రారెడ్డి

చిత్తూరు కలెక్టరేట్ : సేంద్రియ సాగుకు రాష్ట్ర ప్రభుత్వం సహకారం అందిస్తోందని జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ రామచంద్రారెడ్డి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశం డీఆర్‌వో రాజశేఖర్ అధ్యక్షతన జరిగింది. చైర్మన్ మాట్లాడుతూ జిల్లాలో మామిడి సాగు రైతులకు అవగాహన సదస్సులు, ఈ క్రాప్ బుకింగ్, ఈకేవైసీ చేయడంలో అధికారులు ప్రథమ స్థానంలో నిలవడం అభినందనీయమన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వ్యవసాయ రంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. మామిడి పంట జిల్లాలో ఎక్కువగా ఉంటోందని, రానున్న సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని ఉద్యానవన శాఖ ప్రతి మండలంలో అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలో పట్టు పరిశ్రమ విస్తీర్ణతను మరింత పెంచాలన్నారు. నిండ్ర షుగర్స్‌కు సంబంధించి రైతులకు బకాయిలు త్వరితగతిన చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

నాణ్యమైన మామిడి దిగుబడే లక్ష్యం

ఉద్యాన శాఖ అధికారి మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ ఇటీవల మామిడి రైతులకు సదస్సులు నిర్వహించి నాణ్యమైన పంట దిగుబడిపై అవగాహన కల్పించామన్నారు. డ్రిప్‌తోపాటు టేబుల్ వెరైటీస్ మామిడి సాగు చేసే రైతులకు ఫ్రూట్ కవర్స్ పంపిణీకి ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని తెలిపారు. ఏపీ రైతు భరోసా కేంద్రాలకు ఎన్ని అవసరమో అంచనాలను రూపొందిస్తున్నామని పేర్కొన్నారు. తుపాన్‌తో నష్టపోయిన రైతులకు ప్రత్యామ్నాయ పంటలు వేసుకునేందుకు విత్తనాలు ఇచ్చామని, పంట నష్టపరిహారానికి ప్రతిపాదనలు పంపినట్లు పేర్కొన్నారు. జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి వెంకటరావు మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా పశువులకు వ్యాక్సినేషన్ పూర్తి చేసినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 300కు పైగా చాప్ కట్టర్లు పంపిణీ చేశామన్నారు. పట్టు పరిశ్రమ శాఖ జిల్లా అధికారి శోభారాణి, ట్రాన్స్‌కో ఎస్‌ఈ శ్రీహరి, లీడ్ బ్యాంక్ మేనేజర్ శేషగిరిరావు, శాస్త్రవేత్త ప్రసన్నలక్ష్మి, సలహా మండలి సభ్యులు గోవర్ధన్ బాబి, శివప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

రైతు సమస్యల పరిష్కారం

డీఆర్‌వో రాజశేఖర్ మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో రైతు భరోసా కేంద్రాల్లో, మండలాల స్థాయిలో వ్యవసాయ మండలి సమావేశాలు నిర్వహించి రైతుల సమస్యలను పరిష్కరిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మురళీకృష్ణ మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల్లో ఎరువులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

రిజిస్ట్రేషన్లపై త్వరలో అవగాహన

చిత్తూరు కార్పొరేషన్: సచివాలయ పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ సహాయకులకు రిజిస్ట్రేషన్లపై ఈ నెలఖరులోగా రెండు రోజుల అవగాహన తరగతులు నిర్వహించనున్నట్లు జిల్లా రిజిస్ట్రార్ శ్రీనివాసరావు తెలిపారు. ఉమ్మడి జిల్లాలో 73 సచివాలయాలు రిజిస్ట్రేషన్లకు ఎంపిక కాగా, అందులో చిత్తూరు జిల్లాలో 63 సచివాలయాలు ఉన్నాయన్నారు. వీటి పరిధిలో ఉమ్మడి జిల్లాలో 126 గ్రామాలు ఉండగా, చిత్తూరు జిల్లాలో 114 గ్రామాలు వస్తాయన్నారు. మొత్తం 73 సచివాలయాల్లోని 130 మంది ఉద్యోగులకు జెడ్పీ సమావేశ మందిరంలో రిజిస్ట్రేషన్లపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. 116 సచివాలయాల పరిధిలో ల్యాండ్ పార్సిల్ మ్యాపింగ్ (ఎల్‌పీఎం) నంబర్ ఆధారంగా సర్వే పూర్తి చేశామని చేశామన్నారు. త్వరలో మిగిలిన 10 సచివాలయాల పరంగా ఎల్‌పీఎం నంబర్ సర్వే పూర్తి చేస్తామని తెలిపారు. ప్రస్తుతం రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో కార్డ్ సాఫ్ట్‌వేర్ వాడుతున్నారని, దాని కంటే మెరుగైన నూతన సాఫ్ట్‌వేర్‌ను సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియకు వినియోగిస్తామని వివరించారు.

స్టాంప్ వెండర్స్ నిబంధనలు పాటించాలి

చిత్తూరు కార్పొరేషన్: జిల్లాలోని స్టాంప్ వెండర్స్ నిబంధనలకు విరుద్ధంగా అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని జిల్లా రిజిస్ట్రార్ శ్రీనివాసరావు తెలిపారు. ఇటీవల విజిలెన్స్, సబ్ రిజిస్ట్రార్లు నిర్వహించిన తనిఖీల్లో వెండర్స్ అధిక ధరకు స్టాంప్ పేపర్స్ విక్రయిస్తున్నట్లు తేలడంతో కుప్పంలో ముగ్గురి లైసెన్స్‌లు సస్పెండ్ చేశామన్నారు. జిల్లాలో మొత్తం 165 మంది లైసెన్స్ కలిగిన వెండర్స్ ఉన్నరన్నారు. త్వరలో సమావేశం నిర్వహించి వెండర్స్‌కు సూచనలిస్తామని తెలిపారు.

చెక్ బౌన్స్ కేసులో ఆర్నెళ్ల జైలు శిక్ష

చిత్తూరు అర్బన్: చెక్ బౌన్స్ కేసులో నిందితుడు మదనపల్లెకు చెందిన జాకీర్‌హుస్సేన్‌కు జైలుశిక్ష విధిస్తూ చిత్తూరు ఎక్సైజ్ మేజిస్ట్రేట్ న్యాయస్థానం శుక్రవారం తీర్పునిచ్చింది. మదనపల్లెకు చెందిన జాకీర్‌హుస్సేన్ వ్యాపారం కోసం 2012 ఫిబ్రవరిలో చిత్తూరులోని శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ నుంచి రూ.20 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. 90 నెలలకు ఈ మొత్తాన్ని చెల్లించేలా ఒప్పందం కుదుర్చుకుని బ్యాంకు చెక్కులు ఇచ్చాడు. నెలసరి వాయిదా సక్రమంగా చెల్లించకపోవడంతో ఫైనాన్స్ నిర్వాహకులు చెక్కును బ్యాంకులో వేయగా.. అది బౌన్స్ అయ్యింది. దీంతో కోర్టును ఆశ్రయించారు. నేరం రుజువుకావడంతో నిందితుడికి ఆర్నెళ్ల జైలు శిక్ష విధిస్తూ మేజిస్ట్రేట్ రవి తీర్పునిచ్చారు. తీసుకున్న అప్పును సైతం చెల్లించాలని తీర్పులో పేర్కొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం





బంగారుపాళెంలో సౌత్‌ఇండియా వాలీబాల్ టోర్నీని ప్రారంభిస్తున్న టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, తమిళనాడు-కేరళ మహిళల జట్ల మధ్య సాగుతున్న పోటీ

బంగారుపాళెం: క్రీడా పోటీలు మానసికోల్లాసానికి దోహదం చేస్తాయని టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం సాయంత్రం సౌత్ ఇండియా ఇన్విటేషన్ వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభమైంది. టోర్నమెంట్‌ను వైవీ సుబ్బారెడ్డి ప్రారంభించి, క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఆయన మాట్లాడుతూ, క్రీడలతో సమైక్యత, స్నేహబంధాలు బలపడుతాయని పేర్కొన్నారు. శారీరక, మానసిక ఉత్తేజానికి క్రీడలు అవసరమని చెప్పారు. క్రీడలతో ఏకాగ్రత, పట్టుదల పెంపొందుతాయని తెలిపారు. ఇటువంటి పోటీలు యువతలో క్రీడాసక్తిని పెంపొందించేందుకు తోడ్పడతాయన్నారు. పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు మాట్లాడుతూ, బంగారుపాళెం మండలం వాలీబాల్‌కు పెట్టింది పేరని అన్నారు. వాలీబాల్ క్రీడలో మండలం నుంచి ఎందరో క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదిగిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రారంభ పోటీలలో తమిళనాడు పోలీస్ జట్టు -మద్రాసు యూనివర్సిటీ జట్ల మధ్య పోటీ రసవత్తరంగా సాగింది. పోటీలను తిలకించేందుకు పెద్ద సంఖ్యలో క్రీడాభిమానులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో చెన్నై బ్లిట్జ్ యాజమాన్యం హనీమీరెడ్డి, విక్రాంత్‌రెడ్డి, కిరణ్ తులసిరెడ్డి, జెడ్పీ మాజీ చైర్మన్ కుమార్‌రాజా, ఎంపీపీ అమరావతి, వైస్ ఎంపీపీ శిరీష్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్, స్థానిక సర్పంచ్ ఉమాదేవి, ఎంపీటీసీ ఉష తదితరులు పాల్గొన్నారు.

అండర్-14 జిల్లా కబడ్డీ జట్ల ఎంపిక



ఎంపికైన బాలికల జట్టు, బాలుర జట్టు

పుత్తూరు రూరల్: పుత్తూరు ఎస్ఆర్ఎస్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో శుక్రవారం ఉమ్మడి చిత్తూరు జిల్లా అండర్-14 కబడ్డీ బాల బాలికల జట్లను ఎంపిక చేశారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శులు బాబు, సరేష్‌బాబు ఆధ్వర్యంలో జట్ల ఎంపిక జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన మున్సిపల్ చైర్మన్ ఏ.హరి విచ్చేశారు. వైస్ చైర్మన్ డి.జయప్రకాష్, హెచ్ఎం ఉమాశంకర్, తిరుపతి జిల్లా పీడీ సెక్రెటరీ సుబ్రమణ్యంరెడ్డి, కబడ్డీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్ర, పీడీలు గుర్రప్ప, మణి, రాజా, కేశవులు, సుబ్రమణ్యం, దశరథ, కిషోర్‌కుమార్, వెంకటేష్, చెన్నకేశవులు, స్వర్ణ, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

43 మంది స్టాఫ్‌నర్సుల నియామకం

చిత్తూరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని ఒక ఏరియా ఆస్పత్రి, 10 సీహెచ్‌సీలకు శుక్రవారం 43 మంది స్టాఫ్‌నర్సులను నియమించారు. కుప్పం ఏరియా ఆస్పత్రికి ఇద్దరిని, కార్వేటినగరం సీహెచ్‌సీకి 10 మందిని, మహల్‌కు 10 మందిని, పెనుమూరు ముగ్గురు, బి.కొత్తకోట ముగ్గురు, సదుం ఇద్దరు, పి.కొత్తకోట ఇద్దరు, వి.కోట ఇద్దరు, తంబళ్లపల్లి ఒకరు, పుత్తూరుకు ఒకరు చొప్పున్న స్టాఫ్ నర్సుల పోస్టులను భర్తీచేశారు. ఈమేరకు డీసీహెచ్ఎస్ బీఎస్‌కే నాయక్ అభ్యర్థులకు నియామక పత్రాలను అందజేశారు.

సంపులో పడి నాలుగేళ్ల చిన్నారి మృతి

పలమనేరు: నీటి సంపులో పడి బాలుడు మృతిచెందిన సంఘటన పలమనేరు పట్టణంలోని జెండామఠం వీధిలో శుక్రవారం సాయంత్రం విషాదం నింపింది. స్థానికుల కథనం మేరకు ..ఆ ప్రాంతానికి చెందిన గోపికి ఇద్దరు పిల్లలు. కుమారుడు హర్షవర్ధన్(4) నర్సరీ చదువుతున్నాడు. శుక్రవారం సాయంత్రం స్కూల్‌నుంచి వచ్చిన బాలుడు ఇంట్లో తల్లి ఇచ్చిన పాలు తాగి వీధిలోకి ఆడుకోవడానికి వస్తూ ఇంటి ముందున్న నీటితొట్టె(సంపు)లో పడిపోయాడు. అయితే కుటుంబీకులు వారి పనుల్లో ఉండిపోయారు. కాసేపటి తర్వాత ఇంటిముందు బాలుడు కనిపించకపోవడంతో చుట్టుపక్కల వెతికారు. ఆచూకీ తెలియలేదు. అనుమానం వచ్చి సంపులో చూడగా నీటమునిగి బిడ్డ చనిపోయి ఉన్నాడు. దీంతో తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. ఒక్కగానొక్క మగబిడ్డను దేవుడు అప్పుడే తీసుకెళ్లాడా అంటూ వారి రోదించడం అక్కడి వారిని కంటతడి పెట్టించింది.

పంటలపై ఏనుగుల దాడులు



ధ్వంసమైన అరటి చెట్లు

సోమల: మండలంలో పంట పొలాలపై ఏనుగుల దాడులు మళ్లీ ప్రారంభమయ్యాయి. గురువారం రాత్రి ఆవులపల్లె పంచాయతీ పత్రిపల్లెకు చెందిన రామ చంద్రయ్య, కృష్ణయ్యకు చెందిన చెరుకు, మామిడి, టెంకాయ తోటలు, 81 చిన్న ఉప్పరపల్లెకు చెందిన మునయ్య, చంద్రశేఖర్ నాయుడుడు చెందిన అరటి, మామిడి, సపోటా తోటలపై విరుచుకు పడ్డాయి. సపోటా, మామిడి చెట్ల కొమ్మలను విరిచి వేశాయి. అరటి చెట్లను నేలకూల్చాయి.

రొంపిచెర్ల వాసి కువైట్‌లో మృతి



బాదుల్లాసాహెబ్

రొంపిచెర్ల: రొంపిచెర్లకు చెందిన వ్యక్తి గురువారం రాత్రి కువైట్‌లో మృతి చెందాడు. స్థానిక కోలిమివీధికి చెందిన బాదుల్లా సాహెబ్ (47) బతుకుదెరువు కోసం ఐదేళ్ల క్రితం భార్య జరీనా(42)తో కలసి కువైట్‌కు వెళ్లారు. ఆయన భార్య 20 రోజుల క్రితం స్వగ్రామం రొంపిచెర్లకు వచ్చారు. బాదుల్లాసాహెబ్ ఫిబ్రవరిలో ఇంటికి వస్తానని భార్య, పిల్లలకు చెప్పారు. అయితే గురువారం సాయంత్రం టైలరింగ్ పనిచేస్తుండగా గుండెపోటు వచ్చింది. చికిత్సకోసం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ రాత్రి ఆయన కన్నుమూశాడు. మృతుడికి ఒక కుమారుడు మహ్మద్, ఒక కుమార్తె రిజ్వానా ఉన్నారు. బాదుల్లాసాహెబ్ మృతదేహాన్ని రొంపిచెర్లకు తీసుకుని వచ్చే ఏర్పాట్లు జరుగుతున్నాయి.

రూ.86 లక్షల మద్యం ధ్వంసం



పలమనేరు: పలమనేరు నియోజకవర్గంలో వివిధ కేసుల్లో పట్టుబడిన 12,700 లీటర్ల కర్ణాటక మద్యం, 125 లీటర్ల సారాను ఎస్పీ ఆదేశాల మేరకు స్థానిక పోలీసులు శుక్రవారం ధ్వంసం చేశారు. పట్టణ సమీపంలోని డంపింగ్‌యార్డు వద్ద రోడ్డు రోలర్‌తో తొక్కించి నాశనం చేశారు. ధ్వంసం చేసిన మద్యం విలువ సుమారు రూ.86 లక్షలుగా సెబ్ అసిస్టెంట్ సూపరింటెంటెంట్ ఆయేషా తెలిపారు. పలమనేరు, గంగవరం సీఐలు చంద్రశేఖర్, అశోక్‌కుమార్, సెబ్ సీఐ ఎల్లయ్య, పలమనేరు, గంగవరం మండలాల ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

పకడ్బందీగా కానిస్టేబుల్ ప్రిలిమ్స్

- రేపటి పరీక్షలకు రెండు జిల్లాల్లో సర్వం సిద్ధం
- నిమిషం ఆలస్యమైనా అనుమతి నిరాకరణ
- చిత్తూరు జిల్లాలో 33 కేంద్రాలు.. 12,196 మంది అభ్యర్థులు
- తిరుపతిలో 57 కేంద్రాలు.. 31,588 మంది అభ్యర్థుల దరఖాస్తు
- వివరాలు వెల్లడించిన ఎస్పీలు రిషాంత్‌రెడ్డి, పరమేశ్వర్‌రెడ్డి



చిత్తూరులో వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రిషాంత్‌రెడ్డి



తిరుపతి : సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి

చిత్తూరు అర్బన్/ తిరుపతి క్రైమ్: పోలీసు కానిస్టేబుల్ పోస్టుల భర్తీ కోసం ఆదివారం చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో ప్రిలిమ్స్ పరీక్షలు జరగనున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 43,784 మంది అభ్యర్థులు ఈ పరీక్షలకు హాజరుకానున్నారు. చిత్తూరు జిల్లాలో 33, తిరుపతి జిల్లాలో 57 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇందుకోసం పోలీసుశాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. శుక్రవారం చిత్తూరులో ఎస్పీ రిషాంత్‌రెడ్డి, తిరుపతిలో ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి ప్రిలిమ్స్ పరీక్షల వివరాలను మీడియాకు వెల్లడించారు. ఎస్పీలు మాట్లాడుతూ ..

రాష్ట్ర ప్రభుత్వం గత ఏడాది కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇందులో భాగంగా తిరుపతి జిల్లాలో 110 పోస్టులు, చిత్తూరు జిల్లాలో 240 కానిస్టేబుల్‌తో పాటు 630 ఐఆర్ బెటాలియన్ కానిస్టేబుల్ పోస్టులను భర్తీ చేయనున్నారు. రాష్ట్ర పోలీస్ రిక్రూట్మెంట్ బోర్డు ఈనెల 22వ తేదీన ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రిలిమ్స్ పరీక్షల నిర్వహించనుంది. అభ్యర్థులను 9 గంటల నుంచే పరీక్ష కేంద్రాల్లోకి అనుమతిస్తారు. 10 దాటిన తరువాత నిమిషం ఆలస్యమైనా అనుమతి ఉండదు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పరీక్షలు నిర్వహించే కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుంది. పరీక్ష కేంద్రాల వద్ద 100 మీటర్ల వరకు జనాలు గుమికూడి ఉండడం నిషేధం. సీసీ కెమెరాల నిఘా నీడన పరీక్షలు జరుగుతాయి. ఎలక్ట్రానిక్ వస్తువులు పరీక్ష కేంద్రంలోకి తీసుకురాకూడదు. హాల్ టికెట్‌తో పాటు ఏదైనా ఒరిజినల్ గుర్తింపు కార్డు ఒకటి, బ్లూ, బ్లాక్ బాల్ పెన్నులు మాత్రమే అనుమతిస్తారు. మాల్ ప్రాక్టీస్, కాపీయింగ్ పాల్పడితే జీవితంలో ఎపుడూ పోలీసు ఉద్యోగాలకు హాజరుకాకుండా కఠినంగా వ్యవహరిస్తారు. పరీక్షల్లో పాస్ చేయిస్తామని చెప్పే దళారీలు నమ్మొద్దు. ఉద్యోగాలు ఇప్పిస్తామని దళారులు ఎవరైనా సంప్రదిస్తే డయల్-100కు సమాచారం ఇవ్వాలి. దళారీలను నమ్మి డబ్బులు పోగొట్టుకోవద్దు. ఎంపిక ప్రక్రియ మొత్తం పారదర్శకంగా జరుగుతుందని వారు వివరించారు.

టీచర్‌గా మారిన కలెక్టర్



విద్యార్థుల సామర్థ్యాలను తెలుసుకుంటున్న కలెక్టర్ హరి నారాయణన్

చిత్తూరు కలెక్టరేట్: గంగాధరనెల్లూరు జెడ్పీ హైస్కూల్‌లో శుక్రవారం జిల్లా కలెక్టర్ హరి నారాయణన్ ఉపాధ్యాయుడయ్యారు. పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. తొమ్మిదవ తరగతి విద్యార్థుల గదిలోకి వెళ్లి ఆయన టీచర్‌గా మారారు. విద్యార్థులు ఇటీవల రాసిన సమ్మేటివ్ పరీక్షల జవాబుపత్రాల మూల్యాంకనాన్ని పరిశీలించారు. సమ్మేటివ్ పరీక్షల్లో తొమ్మిదవ తరగతి విద్యార్థులకు వచ్చిన మార్కులను అడిగారు. ఓ విద్యార్థినిని మనం ఏ ఖండంలో ఉన్నాం, మ్యాప్‌లో చూపించాలన్నారు. ఇంగ్లిష్ సామర్థ్యాన్ని తెలుసుకునేందుకు విద్యార్థులను ఆంగ్లంలో ప్రశ్నలు అడిగారు. విద్యార్థులు చక్కగా సమాధానం ఇవ్వడంతో కలెక్టర్ అభినందించారు.

బండరాయిని ఢీకొన్న కారు..

– ఒకరు మృతి, మరొకరికి తీవ్రగాయాలు



మృతి చెందిన భానుచంద్



క్షతగాత్రుడు హర్ష

కార్వేటినగరం: కార్వేటినగరం సమీపం డంపింగ్ యార్డు వద్ద శుక్రవారం ఉదయం కారు అదుపుతప్పి బండరాయిని ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఎస్ఐ దస్తగిరి కథనం మేరకు..తిరుపతి రూరల్ ముత్యాల రెడ్డిపల్లెకు చెందిన మురళీకృష్ణారెడ్డి కుమారుడు కె.భానుచంద్(21), తిరుపతి వైకుంఠాపురానికి చెందిన సురేంద్రరెడ్డి కుమారుడు డి.హర్ష కారులో పచ్చికాపల్లం మీదుగా కార్వేటినగరానికి సొంత పనుల నిమిత్తం కారులో వస్తున్నారు. కార్వేటినగరం సమీపంలోని డంపింగ్ యార్డు వద్ద కారు అదుపు తప్పి రోడ్డు పక్కగా గుట్ట వైపు దూసుకెళ్లి పెద్ద బండ రాయిని ఢీకొంది. ఈ ప్రమాదంలో భానుచంద్, హర్ష కారులో నుంచి రోడ్డుపై పడడంతో డ్రైవింగ్ చేస్తున్న భానుచంద్ అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన హర్షను 108 వాహనంలో స్థానిక ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. భానుచంద్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పుత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సీటు బెల్టు పెట్టుకోక పోవడంతోనే కారు నుంచి ఎగిరి పడి భానుచంద్ మృతి చెందాడని, హర్ష గాయపడ్డాడని ఎస్ఐ తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.